కథానిక

# చైనా గోడ

ఆర్. యం. చిదంబరం

భూపతి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనలా చేస్తాడని ఎవరూ కలలో కూడా భావించలేదు. మిత్రులందరూ విస్తుపోయారు. ప్రాణమిత్రుని ఆత్మశాంతి కోసం రెండశ్రు బిందువులు విడిచాను. మనసు మనసులో లేదు. మెదడు భయంతోను, విచారంతోను మొద్దు బారిపోయింది.

"సార్! లెటర్!" పోస్టుమేన్ కేక విని మనస్సు మళ్ళీ యీ లోకంలోనికి వచ్చింది. వెళ్ళి ఉత్తర మందుకున్నా. ఎడ్రసు చూచేసరికి గుండె గుభేల్ మంది. అది భూపతి దస్తూరీ. చనిపోయినవాడిదగ్గరనుండి ఉత్తరం వచ్చింది. మనసు మనసులో లేదు కవరు చించి ఉత్తరం చదవటం ప్రారంభించాను—

* * *

ప్రాణ మిత్రునికి,

నా ప్రవర్తనకు ఆశ్చర్యపడి ఉంటావు. నన్ను వట్టి మూర్ఖునిగా తలచి ఉంటావు. మిత్రులంతా నేను వెర్రివాడనుకుంటారు. కాని నేనీ పనిచేయటానికి ముందు నాలో వ్యతిరేక శక్తులున్నాయేమో నని హృదయమంతా గాలించాను అన్నీ అనుకూలశక్తులేకనిపించాయి.

ఆ దినం నా జీవితానికంతా దుర్దినం. నా ఆశల్ని, నా భవిష్యత్తును కూల్చి నాశనం చేసిన దినం. నేను రోజును నిందించను. ఎందుచేతనంటే మన సుబ్బారావు ఆనాడే పజిల్సులో పదివేలు సంపాదించాడు. బ్రహ్మ రాతమీద నమ్మకముంటే అది నా నుదుటిమీది గీత. ఆ రోజున నాకుజరిగిన సంఘటన మరెవరికిజరిగినా వారీపాటికి స్వర్గ వీధుల్లో విహరించేవారు.

రోడ్డుకు ఎడమవైపుగానే నడవాలని నాకు బాగా తెలుసు. రోడ్డు మధ్యగా యెన్నడూ నడచి యెరుగను. కాలం, కర్మం కలిసివచ్చాయి. రోడ్డుకు మధ్యగా నడిచాను. టర్నింగులో కారు క్రింద పడ్డాను. అంతటితో చనిపోయినా బాగుండును. ఆత్మహత్య చేసుకునే అగత్యం లేకపోయేది.

స్పృహ వచ్చేసరికి ఆసుపత్రిలో ఉన్నా. కళ్ళు తెరిచాననుకుంటూ, నేను గమనించినది నా ప్రక్కన నిలుచబడున్న ఒకజవ్వనిని. అంతవరకే గుర్తించగలిగాను. బాధతో కళ్ళు మూసుకున్నాను. ప్రతీఘట్టం వర్ణిస్తేనే నీకు నా మానసిక పరివర్తన అర్థమవుతుంది.

కొంత తేరుకున్నాను. నాకు హృదయబలం లభించింది కాని దేహబలం లభించలేదు. ఈ సారి రెండు కళ్ళతోనూ ఆ యువతిని నిండుగా చూచాను. ఎంత అందమైనదనుకున్నావు? ఏ అలంకారాలకు చెందని ఈ వాక్యమే ఉత్తమంగా ఉంది. ఈ లోకత్రయంలో ఆమెవంటి సౌందర్యరాశిని చూడలేవు. ఆమె నాకు వైద్యం చేస్తున్న డాక్టరుగారి కూతురు-వనజ. నేను ఆ డాక్టరు కారు క్రిందే పడ్డాను.

నా మనస్తత్వం నీకు బాగా తెలుసుననుకుంటాను. ధనవంతులను నేనెంతగాఅసహ్యించుకుంటానో నీకు తెలుసు. ఆ ఏవగింపే నా జీవితాన్ని అంతం చేసింది. పాపం! ఆమె నాకోసం ఎంత అవస్థపడింది. ఎన్నిరాత్రులు నిద్రలేకుండా నా ప్రక్కన కూర్చుని ఉపచారాలు చేసింది! ముక్కూ మొహం తెలియని ప్రాణిని రక్షించటానికి ఆమె పడ్డ పాట్లకు ధన్యవాదాలర్పించితీరాలి. నేను మానసికంగా కోలుకున్నాను. పదడుగులు నడువ గలిగాను.

వనజ నా వివరాలన్నీ తెలుసుకుంది. నేను రచయితనని తెలిశాక ఆమె ఆనందానికి మేర లేదు. ఆమె కళ్లు మెరిశాయి. నన్ను తెగ పొగిడింది. "పేద గుండె" అన్న నా కథ ఉత్తమోత్తమంగావుందని ఆమె పదేపదే అంది. నేను నిజంగా సంతోషమనేది అనుభవించాను.

ఆనాటి సాయంత్రం డాక్టరు నా దగ్గరకు వచ్చాడు. అతనెప్పుడూ నాతో మాట్లాడి యెరుగడు. అతని రాక నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"నీకు తలిదండ్రులు, బంధువులు లేరా నాయనా?" అని ప్రశ్నించాడు ప్రేమ పూర్వకంగా.

"లేరండి...డాక్టరుగారూ! నాకు నయమయింది. అనవసరంగా మిమ్మల్ని బాధించటం న్యాయం కాదు, నాకు సెలవివ్వండి. వెళ్ళిపోతాను" అన్నాను ప్రాధేయపూర్వకంగా.

"నిన్నప్పుడే వదలటానికి వీల్లేదు. నీకు బాగా దేహారోగ్యం కలిగిన వెనుక ఆలోచిద్దాం. సరే కాని నీకు పెళ్ళి కాలేదన్న మాట."

"నా కెవరూ లేరని ఇందాకనే చెప్పాను కదండి."

"నీతో ఒక విషయం చెప్పవలసి ఉంది—నీ కభ్యంతరం లేకపోతే."

డాక్టరు ధోరణి నా కర్థం కాలేదు.

"ఫరవాలేదు, చెప్పండి—"

"మరేమీ లేదు. మా అమ్మాయి నువ్వు మంచాన పడున్నప్పుడు ఎంత బాధపడిందో, నిన్ను యెంతగా కనిపెట్టుకుందో నువ్వు గుర్తించావా?"

"గుర్తించకేం? ఆమె ఋణం ఎన్నడూ తీర్చుకోలేను."

"దానికేం! వనజకు కథలంటే చాలా యిష్టం. ముఖ్యంగా నీకథలంటే అతి ప్రేమ. నువ్వు కథకుడవని తెలిశాక ఆమెకు నీమీద గౌరవం రెట్టించింది."

"నాకు డాక్టరు అభిప్రాయం కొద్దిగా అర్థమయింది.

"మా అమ్మాయి నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటోంది. మీరిద్దరూ హాయిగా ఇక్కడుండొచ్చు. నీ కిష్టమేనా?"

నేను రెండునిమిషాలు మౌనం దాల్చాను.

"మీరిద్దరూ" అన్నమాట కర్ణకఠోరంగా ఉంది. "నన్ను ఆలోచించుకోనివ్వండి" అన్నాను చివరకి. డాక్టరు సరేనని వెళ్ళిపోయాడు.

నేను వట్టి మూర్ఖుడననుకుంటావు. నావంటి నిరుపేదకు అటువంటి అవకాశం లభించటమే అరుదు. వెంటనే అంగీకరించవలసింది అంటావు. అది సహజం. కాని ఎందుకో నా హృదయం అంగీకరించటం లేదు. హృదయ కవాటాలు మూసుకున్నాయి. చీకటి వ్యాపించింది. దీనికి కారణం నాకు సహజంగా శ్రీమంతుల మీదుండే కోపమే. వనజ శ్రీమంతుని కూతురు. ఒకనాడు కాకపోతే ఒకనాడైనా ఆమెవల్ల నాకు పరాభవం తప్పదు. ఆమె ధనంతో ఆమెకు భర్తనై జీవించటానికి నా ఆత్మ అంగీకరించలేదు. అది నా దురదృష్టమే.

ఆ రాత్రి—

వనజ నాకు మందు తీసుకొచ్చింది. ఆమె సుందరవదనంలో ఎన్ని కాంతులు ప్రకాశిస్తున్నాయి!

"మీరు నాకు చాలా సాయం చేశారు. మీకు చాలా ఋణపడ్డాను. నాకు ప్రాణదానంచేశారు. ఇంకా మిమ్మల్ని బాధించటం న్యాయం కాదు. అనుమతిస్తే వెళ్ళిపోతాను" అన్నాను.

ఆమె ఆశ్చర్యంగా నావైపు చూచింది. ఆమెలో చెలరేగుతున్న భావ పరంపరల నర్థం చేసుకున్నాను.

"నాన్నగారు ఇవాళ మీతో యేమీ మాట్లాడలేదా?" అని ప్రశ్నించింది చివరికి.

"మాట్లాడారు" అన్నాను.

"మరి మిమ్మల్ని వెళ్ళొద్దని చెప్పలేదూ? మీకు ఆరోగ్యం చేకూరలేదు. మీ రింకా బలహీనంగా ఉన్నారు. మొన్న తెగించి నడవబోయి కొంత దూరం నడిచాక పడిపోయారు. జ్ఞాపకముందా?" అసలు సంగతి చెప్పలేకపోతోంది వనజ.

నిజమే. పదడుగులకన్న ఎక్కువ నడువలేను. ఆ మాట వాస్తవం. కాని ఎలాగో యోజనాల కొలది విశ్రాంతి లేకుండా నడచిపోగలనని హృదయం ధైర్యం చెబుతోంది. మొండి ధైర్యం.

"ఫరవాలేదు. మొన్న కాలుజారి పడ్డాను. అంతే" అని సమర్థించుకున్నాను.

"అలా కాదు. మీ రిప్పుడే వెళ్ళిపోతే నే నింతకాలం చేసిన శుశ్రూషంతా వృథా అవుతుంది. నా హృదయం గాయపడుతుంది."

ఇక దాస్తే లాభంలేదని నా ఉద్దేశ్యం చెప్ప నిశ్చయించుకున్నాను.

"నన్ను క్షమించాలి. మీ ఉద్దేశం డాక్టరు గారు చెప్పారు. కుండ బ్రద్దలు కొట్టినట్లు మాట్లాడటం నా తత్వం. నా సమాధానం బాధ కలిగిస్తే క్షమించండి. నన్ను పెళ్లి చేసుకుంటే మీరు సుఖపడలేరు. మీకు దుఃఖమే మిగులుతుంది. నాకూ ధనవంతులకూ సఖ్యం కుదరదు. నేను దరిద్ర ప్రియుడిని."

ఆమె విస్తుపోయి వింటోంది.

"ప్రేమకు త్యాగం అవసరం. ప్రేమకు త్యాగమే ముఖ్యం. నన్ను పెళ్ళి చేసుకోతలచుకుంటే మీరు త్యాగం చెయ్యాలి. ఆపాటి త్యాగం చేయలేకపోతే నాకు అనుమతివ్వండి. వెళ్ళిపోతా."

ఆమె సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయింది. ఆమె ముఖంలో నల్లటి నిరాశా రేఖల్ని చూచాను. కాని ఏంచేస్తాను? ఆమె డబ్బుకు దూరంగా ఉండలేదు. నా ఆత్మప్రబోధాన్ని నేను తిరస్కరించలేను.

ఆ మరునాడు డాక్టరు నాకు హితోపదేశం చేశాడు: "డబ్బులేని మనిషి బ్రతికుంటే ఏంలాభం? సిరి నెవడన్నా కాలదన్నుతాడా? హాయిగా ఉండమంటే ఈ మానసిక వ్యధెందుకు? ఏ అష్టాధికారినో వరించవలసిన వనజ నిన్ను వరించటం నీ అదృష్టం. అనవసరంగా మథనపడుతున్నావు ధనముంటేనే బ్రతుకు."

నాకు డాక్టరు హితోపదేశం బుర్రకెక్కలేదు. ఆరాత్రి నుండి నా జీవితం మంచి మార్గాన పడుతుందనుకున్నా. వనజ అమాయకంగా నిద్రపోతోంది. అంతా నిశ్శబ్దం-గాఢాంధకారం. చల్లగా తండ్రి కాళ్ళకు మనస్ఫూర్తిగా నమస్కరించి బయటికి వచ్చేశాను. రైలులో ఇంకో ఊరు వచ్చేశాను. ఒక స్నేహితుడింట్లో చేరాను. బ్రతుకు ఆలాగే నడిచింది. వనజ అప్పుడప్పుడు గుర్తుకు వచ్చేది, కాని ఆమెకు నేను గుర్తున్నానో లేదో!

మళ్ళీ ఆదినం వచ్చింది. విడిపోయిన చీకటి మళ్ళీ అలుముకుంది. వెలుగుతూన్న ఆశాజ్యోతి అమాంతంగా ఆరిపోసాగింది. వనజ వచ్చింది.

"నన్ను అగాధంనుండి పైకి లేవదీయండి. నేను మిమ్మల్ని మనసారా ప్రేమించాను. నాకున్నది ఒక్క హృదయమే. మళ్ళీ గాయాన్ని రేపితే మరణమే శరణ్యమవుతుంది" అని ప్రార్థించింది. రెండేళ్ళనుండి నా ఉనికికోసం గాలించింది. ఇప్పటికి తన ప్రయత్నం ఫలించింది. వనజ ఎంత మంచిది!

నేనూ వనజను ప్రేమిస్తున్నా. కాని చైనా గోడలా మా అంతరం? "వనజా! ఆ ధన పిశాచాన్ని త్యాగంచేసి ఆనందమయ జీవిత మనుభవించు. ఈపాటి త్యాగం చేయలేవా?"

ఆమె ఎంతసేపూ డబ్బుయొక్క విలువను గురించే చెప్పింది. డబ్బులేనివాడి బ్రతుకెందుకు? వాడి జీవితం శవంతో సమానం. అని వనజ ఆ త్యాగాన్ని చేయలేకపోయింది.

వనజ నిజంగా నా శిలాహృదయానికి బలవుతుంది. ఆమె ప్రేమ నిష్కల్మషమైనది. ఆమె హృదయం తెల్లమల్లెపూవులాంటిది. ఆమె మరణిస్తుంది. ఆమె నిశ్చయం తిరుగులేనిది.

ఆమె చావుకు నేను కారకుడనవనా? ఆమె హృదయాగ్ని నన్ను చుట్టుముట్టి దహిస్తుంది. ఆ తీరని ఆవేదనతో బ్రతుకు మధురంగా ఉంటుందా? ఎలాగా నాకు అశాంతి తప్పదు. అందుకే ఈపని చేశాను. నేను మూర్ఖుడ ననుకుంటావు. అది సహజం, కాని ఎంత వెదకినా నాలో మూర్ఖత్వం కనిపించటం లేదు.

ప్రేమకోసం నే వాంఛించిన త్యాగం వనజ చేయలేకపోయింది. నేను చేశాను. త్యాగరహిత ప్రేమ ప్రేమకాదు, ఇది త్యాగం కాదనిపిస్తోందా? యోచించు. సెలవు."

* * *

ఉత్తరం ముగిసింది. కళ్లు చెమ్మగిల్లాయి. నిట్టూర్పు విడిచాను. భూపతి మనస్తత్వం ఎంత వింతైనది!

ఆ సాయంత్రం మిత్రుడు వెంకటరమణ కనిపిస్తే ఈ విధంతా చెప్పాను. అతను అంతా విని నవ్వి, "వట్టిమూర్ఖుడు. చక్కటి సుందరి సిరితో వస్తుంటే లేనిపోని అపోహాలు, పిచ్చి ఊహాలు పెట్టుకుని కాలదన్ని జీవితాన్ని కావాలని భస్మం చేసుకున్నాడు" అన్నాడు.

కాని అతని మానసిక వ్యథ నర్థం చేసుకోవటమెలాగ?